సాక్షి
ప్రకాశం

శనివారం । 4 । మే । 2024



మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్, పక్కన చెవిరెడ్డి, దద్దాల

గరిష్టం/కనిష్టం
46/29

వాతావరణం

ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.


జనప్రవాహంగా మారిన కనిగిరి పట్టణం

జనప్రవాహ గిరి

కనిగిరి పట్టణం కిక్కిరిసిపోయింది. ఒక వైపు సూర్యుడు నిప్పులు చెరుగుతున్నా లెక్కచేయకుండా అభిమానగణం తరలిరావడంతో రోడ్లన్నీ జనసంద్రమయ్యాయి. శుక్రవారం ఎన్నికల ప్రచారానికి వచ్చిన అభిమాన నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నీరాజనం పలికారు. సభా ప్రాంతం నలుదిక్కులా జనం పోటెత్తారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ జగన్ చేసిన ప్రసంగానికి జనం నుంచి మంచి స్పందన వచ్చింది. సిద్ధమా అంటూ సీఎం చెప్పిన ప్రతి మాటకు మేము సిద్ధం అంటూ జనం శ్రుతి కలిపారు. ఎన్నికల ప్రచారసభ దిగ్విజయం కావడంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది.


చిన్నారిని ముద్దాడుతూ..


మామకు చిన్నారుల సెల్యూట్..


నేను విజిలేస్తే..

- కనిగిరి నలు దిక్కులన్నీ జనమే..జనం
- కదం తొక్కిన పార్టీ శ్రేణులు
- నిప్పులు కురిసిన ఎండలో సైతం పోటెత్తిన అభిమానం
- సీఎం ప్రతి మాటకు సంసిద్ధం అంటూ శ్రుతికలిపిన జనం
- హోరెత్తిన జయహో జగన్ నినాదాలు
- విజయీభవ అంటూ ఆశీర్వదించిన పండుటాకులు

కనిగిరి రూరల్: సార్వత్రిక సమరం వేళ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కనిగిరి పర్యటన పార్టీ కేడర్‌లో కదనోత్సాహాన్ని నింపింది. నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. పట్టణంలో ఎటుచూసినా ఇసుకేస్తే రాలనంతగా జనం నిండిపోయారు. మండుటెండలో భానుడు నిప్పులు చెరుగుతున్నా శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ సంక్షేమ ప్రదాత కోసం ఎదురు చూశారు. సాయంత్రం 4.15 గంటలకు ప్రారంభమైన సభ 4.45 గంటలకు ముగిసింది. సీఎం ప్రసంగిస్తున్న సమయంలో జై జగన్ జై జగన్...సీఎం సీఎం అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

చంద్రబాబును మేము నమ్మం

అశేష జనవాహినిని ఉద్దేశించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రసంగంలో కూటమి నేతలు, చంద్రబాబు చెప్పిన సూపర్ సిక్స్ పథకాలను నమ్ముతారా అంటూ సీఎం అడగ్గా ప్రజలు ''మేము నమ్మం'' అంటూ ప్రతిస్పందించారు. గతంలో ఎటువంటి హామీలను అమలు చేయని చంద్రబాబు, ఇప్పుడు కొత్త హామీలు ఇస్తున్నారు అమలు చేస్తారనే నమ్మకం మీకు ఉందా అని జగన్‌మోహన్‌రెడ్డి అనగానే ''బాబోయ్ బాబును మేము నమ్మం'' అంటూ పెద్ద ఎత్తున నినదించారు. కుట్ర పూరిత వైఖరితో


కిక్కిరిసిన పామూరు బస్టాండ్ రోడ్డు

కుటమి నేతలు చంద్రబాబు వెన్నుదన్నుతో ఎల్లోమీడియా కుట్రలు పన్ని వలంటీర్ వ్యవస్థపై ఫిర్యాదులు చేశారని, దాని ఫలితంగానే అవ్వతాతల పింఛన్లకు ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పుడు చంద్రబాబు చెప్పే మాయమాటలు ప్రజలు నమ్మడానికి సిద్ధంగా లేరని చెప్పగానే ''మోసకారి బాబు'' అంటూ జనం సమాధానం ఇచ్చారు.

మేమంతా సిద్ధం:

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఒంగోలు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్‌ను గెలిపించాలంటూ వారిద్దరినీ సీఎం జగన్ పరిచయం చేశారు. నా ఎడమ పక్కన మంచి వ్యక్తి, సౌమ్యుడు, యువకుడు, ఉత్సాహవంతుడు, నా తమ్ముడు ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ మీ ముందుకు వస్తున్నాడు. మంచి చేస్తాడని నమ్మకం ఉంది. మీ చల్లని దీవెనలు, ఆశీస్సులతో ఆశీర్వదించాలని కోరారు. నా కుడి పక్కన ఎంపీ అభ్యర్థిగా భాస్కర్ ఉన్నాడు. మంచివాడు, సౌమ్యుడు. భాస్కర్ గురించి ఎంత మాట్లాడినా తక్కువే..తన మనసు నాకు బాగా తెలుసు..వెన్నలాంటి మనస్సు. మీకు మంచి చేస్తాడని నమ్మకం ఉంది. వీరిద్దరినీ ఆశీర్వదించి ఓటు వేసి గెలిపించాలని కోరారు. మీరంతా సిద్ధమా అంటూ ప్రజలనుద్దేశించి సీఎం వైఎస్ జగన్ అనగానే మేమంతా సిద్ధం అంటూ ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది.

ఫ్యాన్ ఇంట్లోనే ఉండాలి:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రసంగంలో ఫ్యాన్ గుర్తును చూపిస్తూ నలుదిక్కులా ఉన్న అక్కా చెల్లెళ్లు, అన్నాదమ్ములు, అవ్వాతాతలకు ఫ్యాన్‌ను చూపించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలంటూ విన్నవించారు. ఫ్యాన్ ఇంట్లో ఉండాలి. ప్రజలకు చెడు చేసిన సైకిల్ వీధిలో ఉండాలి, తాగేసిన గ్లాస్ సింక్‌లో ఉండాలంటూ సీఎం తన ప్రసంగంలో చెప్పగానే ఒక్కసారిగా జనం నుంచి కేరింతలు వినిపిస్తూ భారీ స్పందన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీని గెలిపించుకునేందుకు తామంతా సిద్ధమా అంటూ అడగగా తామంతా సిద్ధం అంటూ అశేష జనవాహిని నుంచి విశేష స్పందన వచ్చింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్, డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు, ఏపీరెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్‌గఫార్, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, జెడ్పీటీసీ సంఘం అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, ఎంపీపీలు దంతులూరి ప్రకాశం, గంగసాని లక్ష్మీ హుస్సేన్‌రెడ్డి, గాయం సావిత్రి, తిరుపా గోవర్ధన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సాల్మన్‌రాజు, ఆరు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, వైస్ చైర్మన్‌లు పాల్గొన్నారు.


మేము సిద్ధం అంటున్న జనం..


సంక్షేమ సారథిని చూసేందుకు తరలి వచ్చిన జనం


జగన్ మామకు అభివాదం..


మనవడా చల్లగుండు..


తీన్మార్ స్టెప్పులతో సంబరం..


ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా


- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

కనిగిరి రూరల్: నాకు ఒక్క సారి అవకాశం ఇవ్వండి కనిగిరి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. కనిగిరిలోని పామూరు బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభలో చెవిరెడ్డి మాట్లాడారు. పార్టీలకు, కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనన్నారు. తాను అందరుల్లాగా కానని..తనకు ఎన్నికష్టాలు వచ్చినా.. ఇబ్బందులు వచ్చినా మీ తోటే ఉండి.. మీలో ఒకడిగా ఉండి మీ సమస్యలు తీర్చుతానని చెప్పారు. ప్రతి ఒక్కరూ విజయమే లక్ష్యంగా పనిచేసి త్వరలో జరిగే ఎన్నికల్లో తనను, ఎమ్మెల్యేగా దద్దాలను గెలిపించాలని కోరారు.

ఆశీర్వదించండి..దద్దాల

కనిగిరిలో నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించి కనిగిరి ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తానని.. ఫ్యాను గుర్తుకు ఓటేసి, ఆశీర్వదించి... తనను ఎమ్మెల్యేగా, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని


మాట్లాడుతున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి


అభివాదం చేస్తున్న దద్దాల నారాయణ యాదవ్

మళ్లీ సీఎం చేయాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో సుభిక్ష పాలన అందించిన వైఎస్ జగన్ పై ప్రతి పక్షాలు కూటమి కట్టి అన్ని రకాలుగా దాడులు చేస్తున్నారన్నారు. కూటమి నేతలకు ఓట్ల రూపంలో బుద్ధి చెప్పేలా... మీ అమూల్యమైన ఓటును ఫ్యాను గుర్తుకు వేయాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం లోనే సామాజిక సాధికారత జరిగిందని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కుట్రపూరిత రాజకీయాలను తిప్పికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన నవరత్నాల సంక్షేమ పథకాలు మళ్లీ కొనసాగాలంటే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాలని మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు కోరారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి సీఎం జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన సాగించారని ఏపీ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి అన్నారు. నవరత్నాల సంక్షేమ పథకాలతో దేశంలో ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ మూడు పార్టీలు కూటమిగా చేరి దాడులు చేస్తున్నా...సింహం లాగా ఎదురొడ్డి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సింగిల్‌గా పోటీకి నిలబడ్డారన్నారు. సంక్షేమ లబ్ధిదారులంతా ఫ్యాన్ గుర్తుకు ఓటేసి సామాన్యుడు, బీసీ అయిన దద్దాల నారాయణ యాదవ్‌ను ఎమ్మెల్యేగా, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఎంపీగా గెలిపించి జగనన్నను మళ్లీ సీఎం చేయాలని పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు సముచిత స్థానం దక్కిందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి సీఎం జగన్ మోహన్‌రెడ్డి అని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సాల్మన్ రాజు, జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీలు గంగసాని లక్ష్మీ హుస్సేన్‌రెడ్డి, గాయం సావిత్రి, దంతులూరి ప్రకాశం, వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, ఆర్ మాణిక్యరావు, వాసవీ సత్ర సముదాయ జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, డాక్టర్ పెరుగు మురళీ కృష్ణ, చింతం శ్రీనివాసుల యాదవ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ వైఎం సరితారెడ్డి, సిరుపా గోవర్ధనరెడ్డి, తమ్మినేని సుజాత, జిలాని, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, ఆరు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వైస్ ఎంపీపీలు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్

- 4న పీఓ, ఏపీఓలు, 5, 6 తేదీల్లో ఓపీఓలు, 7న పోలీసు సిబ్బంది
- 4 నుంచి 7వ తేదీ వరకు హోం ఓటింగ్

ఒంగోలు అర్బన్: పోస్టల్ బ్యాలెట్ పొందిన వారు ఓటు హక్కు వినియోగించుకునేందుకు తేదీలు ఖరారు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది, ఇతర సిబ్బంది తమ పోస్టల్ బ్యాలెట్లను ఆయా నియోజకవర్గాల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెషిలిటేషన్ కేంద్రంలో ఓటు వేసి అందచేయాలన్నారు. పోలింగ్ విధులు నిర్వహించే ఉద్యోగులు 21,562 మంది, అత్యవసర విధులు నిర్వహించే 1355 మంది సిబ్బందితో పాటు 2865 మంది ఉద్యోగులు ఇతర జిల్లాలకు చెందిన వారు ఓటర్లుగా నమోదైనట్లు పేర్కొన్నారు. పీఓలు, ఏపీఓలు ఈ నెల 4న, ఓపీఓలు ఈ నెల 5,6 తేదీలు, పోలీసు సిబ్బంది ఈ నెల 7న, అత్యవసర విధులు నిర్వహించే సిబ్బంది ఈ నెల 5 నుంచి 7వ తేది వరకు, ఇతర జిల్లాల్లో ఓటుహక్కు కలిగి ఈ జిల్లాలో పనిచేస్తున్న సిబ్బంది ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్‌లు అందచేయవచ్చన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న ఓటర్లకు నేటి నుండి 7వ తేదీ వరకు ఇళ్ల వద్దనే ఓటు సేకరిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్ పొందిన ఓటర్లు ఎక్కడైతే ఓటు హక్కు ఉంటుందో ఆ అసెంబ్లీ నియోజకవర్గంలోనే ఓటు వేయాలని తెలిపారు. అనివార్య కారణాలతో మొదటి రోజులో ఓటింగ్‌కు వెళ్లని వారు 7వ తేదీ లోగా సంబంధిత కేంద్రాల్లో ఓటు హక్కువినియోగించుకోవచ్చన్నారు. పోలింగ్ అఫిషియల్స్‌లో ఓపీఓలుగా నియమితులైన అంగన్‌వాడీలు ఇప్పటివరకు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోకున్నా వారికి విధులు కేటాయిస్తే ప్రొసీడింగ్ ఉత్తర్వులు, గుర్తింపుకార్డును సంబంధిత రిటర్నింగ్ అధికారికి చూపి పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. అన్ని నియోజకవర్గాలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కోసం ఒంగోలు కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గ కేంద్రాల్లో కూడా ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో ఒంగోలులోని డీఆర్ఆర్ఎంఎ హైస్కూలు, దర్శిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మార్కాపురంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, సంతనూతలపాడు నియోజకవర్గంలోని చీమకుర్తిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొండపిలో జెడ్పీ హైస్కూల్, గిద్దలూరులో జెడ్పీ హైస్కూల్, కనిగిరిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, యర్రగొండపాలెం నియోజకవర్గంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆడిటోరియంలలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బాబు నోట..అబద్ధాల మూట

పసలేని పవన్ ప్రసంగం



మద్యం షాపు వద్ద ఉన్న జనసేన నాయకులు

గిద్దలూరు రూరల్: పవన్ కల్యాణ్ ప్రసంగం పసలేకుండా సప్పగా సాగడంతో కూటమి పార్టీల శ్రేణుల్లో నీరసం కనిపించింది. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రధాన కూడలి వద్ద జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ బహిరంగ సభ ప్రసంగంలో క్లారిటీ లేకపోవడంతో వచ్చిన వారంతా ప్రసంగం మధ్యలోనే వెనుదిరిగారు. సినిమా హీరోగా ఆయనను అభిమానించే కొంతమంది మాత్రమే హాజరవడంతో ఆశించిన స్థాయిలో జనాలు కనిపించలేదు. మూడు పార్టీల కూటమి నాయకులు మద్యం, డబ్బు ఇచ్చి పవన్ బహిరంగ సభకు తరలించేందుకు ప్రయత్నించారు. మద్యం మత్తులో ఊగుతూ ఒకే బైక్‌పై ముగ్గురునలుగురు ఎక్కి రోడ్లపై చక్కర్లు కొట్టారు. ఓటు లేని వారితో కూడా పార్టీ జెండాలు చేతపట్టించి కేకలు వేయించారు. ఒంగోలు–నంద్యాల ప్రధాన రహదారిపై పవన్ ప్రసంగం ఏర్పాటు చేయడం ద్వారా ఎక్కువ మంది జనాలు కనిపించాలని చేసిన ప్రయత్నం విఫలమైంది. జనసేన పార్టీ జెండాలు చేత పట్టి మద్యం షాపుల వద్ద నిలుచుని పూటుగా మద్యం సేవించే వారు అధికంగా కనిపించారు. ఇంత పెద్ద స్టార్ వస్తే.. తక్కువ మంది హాజరవడంపై విమర్శలు వినిపించాయి.

- పొదిలి ప్రజాగళం సభలో పాత పాటే
- బాబు సోది వినలేక మధ్యలోనే వెనుదిరిగిన జనం
- బాబు ప్రసంగంపై ఆ పార్టీ నేతలే నిట్టూర్పు

పొదిలి/మార్కాపురం/మార్కాపురం రూరల్:

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పదే పదే అబద్ధాలు వల్లె వేయడం రివాజుగా మారింది. అధికారంలోకి ఉన్న ఐదేళ్లూ జిల్లాను కరువు ముంగిట్లో ఉంచి గాలికి వదిలేశాడు. అధికారం పోయిన తర్వాత పలుమార్లు జిల్లా పర్యటనకు వచ్చారు. వచ్చినప్పుడుల్లా జిల్లాను అభివృద్ధి చేశానంటూ కల్లబొల్లి మాటలు చెబుతున్నాడు. ఎన్నికల వేళ రెండు పర్యాయాలు మార్కాపురం నియోజకవర్గానికి వచ్చాడు. వెలిగొండ పనులు తన హయాంలోనే ఎక్కువ శాతం జరిగాయంటూ ప్రజలను మోసం చేస్తున్నాడు. వాస్తవానికి ఆయన హయాంలో రెండు కిలోమీటర్లు కూడా పనులు జరగలేదు. ఇచ్చిన నిధులను తన బినామీ కాంట్రాక్టర్‌కు కట్టబెట్టాడు. వాస్తవాలను వక్రీకరిస్తూ సరికొత్తగా వెలిగొండ నుంచి కృష్ణా జలాలను పశ్చిమ ప్రకాశానికి ఇస్తానంటూ బూటకపు హామీలిస్తున్నాడు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పోలవరం తరువాత అత్యంత ప్రాధాన్యత ప్రాజెక్టుగా వెలిగొండను తీసుకుంది. పనులను వేగంగా పూర్తి చేసింది. ఇటీవల సీఎం ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. పొదిలి పట్టణాన్ని ఏనాడూ పట్టించుకోని టీడీపీ ఈ రోజు అభివృద్ధి చేస్తానంటూ ప్రగల్భాలు పలకడంపై జనం చీదరించుకుంటున్నారు. వెలిగొండ ద్వారా పొదిలి పట్టణానికి నీళ్లిస్తానని చంద్రబాబు చెప్పడంపై పార్టీ శ్రేణులు నివ్వెరపోతున్నారు. శుక్రవారం పొదిలి పట్టణంలో ప్రజాగళం పేరుతో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభకు పొరుగు జనాలను తీసుకువచ్చారు. చంద్రబాబు ఊకదంపుడు ఉపన్యాసంతో విసుగు చెందిన అద్దె జనం మధ్యలోనే వెనుదిరిగారు. చంద్రబాబు మాట్లాడుతున్నప్పుడు జనం నుంచి స్పందన కరువైంది. ఏం తమ్ముళ్లా పొదిలిలో నీటి సమస్య ఉంది కదా అంటే స్పందించే వారే కరువయ్యారు. మేనిఫెస్టో గురించి ప్రస్తావించినప్పుడు కూడా స్పందన అంతంతమాత్రంగానే కనిపించింది. అధికారంలో ఉన్న ఐదేళ్లూ ఏనాడూ మార్కాపురం వైపు కన్నెత్తి చూడని బాబుగారు నేడు..మార్కాపురాన్ని ప్రత్యేక జిల్లా చేస్తానంటూ ప్రగల్భాలు పలకడంపై స్థానికులు విమర్శిస్తున్నారు. కుటిల యత్నాలతో పింఛన్‌దారులను రోడ్డు పాల్జేసి..దాన్ని ప్రభుత్వంపై నెట్టేందుకు యత్నించడంపై సభకు హాజరైన వారు చీదరించుకున్నారు. పొరుగు ప్రాంతాల నుంచి ట్రాక్టర్లు, బస్సుల ద్వారా జనాలను తరలించినప్పటికీ ఆశించిన స్థాయిలో రాకపోవడంపై ఆయన స్థానిక టీడీపీ నేతలపై మండిపడ్డారు. బాబు సోది ప్రసంగం కొనసాగుతుండగానే సగం పైగా జనం ఇంటిబాట పట్టారు.



టీడీపీ నేతల ర్యాలీతో ఆగిపోయిన అంబులెన్స్



జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీతో అభిమాని

బాబు సభలో జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీలు

చంద్రబాబు ఎన్నికల సభలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు హల్‌చల్ చేశారు. ఎన్టీఆర్ ఫొటోలను బైక్‌లపై పెట్టుకొని నినాదాలు చేశారు. దీంతో టీడీపీ నాయకులు వారిపై అసహనం వ్యక్తం చేశారు. ఇది ఇలా ఉండగా బాబు ప్రచార సభ జరుగుతున్న సమయంలో అంబులెన్సు వచ్చిన దారి ఇవ్వలేదు. దీంతో స్థానికులు టీడీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆ పాపం టీడీపీదే

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి సురేష్



సింగరాయకొండ: పింఛన్లు తీసుకునేందుకు వృద్ధులు, వికలాంగులు పడుతున్న అగచాట్లు అన్నీ ఇన్నీ కావని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాపానికి కారణం ముమ్మాటికీ టీడీపీ అని ఆరోపించారు. పింఛన్‌దారులకు నేరుగా ఇంటి వద్దకే పింఛన్ డబ్బులు తీసుకెళ్లి ఒకటో తేదీ క్రమం తప్పకుండా అందిస్తున్న వలంటీర్ వ్యవస్థపై ఫిర్యాదులు చేసి పింఛన్ పంపిణీకి ఆటంకాలు సృష్టించింది టీడీపీ కాదా అని ఆయన ప్రశ్నించారు. వృద్ధులు, దివ్యాంగులు పింఛన్ డబ్బుల కోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ఈనెల అయితే బ్యాంకు వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడిందని విమర్శించారు. తొలి నుంచి వలంటీర్ వ్యవస్థపై టీడీపీ విషం చిమ్ముతూ ఎన్నో ఆరోపణలు చేయటమే కాక వారిపై అభ్యంతరకర విమర్శలు కూడా చేశారని ఆరోపించారు. ఇప్పుడు అదే నోటితో చంద్రబాబు అండ్ కో వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, వారి జీతాలు పెంచుతామని చెప్పడం వారి అవకాశవాద రాజకీయానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో మళ్లీ జగనన్న రావాలని వలంటీర్లంతా స్వచ్ఛందంగా రాజీనామా చేసి మరీ ఎన్నికల్లో టీడీపీకి బుద్ధి చెప్పటానికి సిద్ధమయ్యారని, పింఛన్‌దారులు కూడా వీరికి తోడవుతారని మంత్రి సురేష్ అన్నారు.

దళితులపై దర్శి టీడీపీ అభ్యర్థి లక్ష్మి అక్కసు

దర్శి: టీడీపీ ప్రచారంలో భాగంగా దేవవరం పంచాయతీలో గల తమ కాలనీకి రావాలని ఎస్సీకాలనీ వాసులు టీడీపీ అభ్యర్థి లక్ష్మిని ఆహ్వానించారు. లక్ష్మి మాత్రం పల్లెలోకి రానని చెప్పి తిరస్కరించారు. దీంతో మీరు వస్తేనే ఓట్లేస్తాం.. లేకుంటే ఓట్లేయమని మహిళలు తేల్చి చెప్పారు. లక్ష్మి మాత్రం మీరు ఓట్లేయకపోతే పోండి.. నేను మాత్రం రానంటూ అసహనం వ్యక్తం చేసి వెనుదిరిగారు. దీంతో స్థానిక టీడీపీ నేతలు తీవ్ర అవమానానికి గురయ్యారు. ఎన్నికల సమయంలోనే ఇలా ఉంటే.. ఇక మామూలు రోజుల్లో ఆమె ఎలా ఉంటారోనంటూ అసహనం వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కట్టుబడిపాలెంలో కూడా నెలకొంది. లక్ష్మి ప్రచార రథం దిగకపోవడంతో అక్కడ కూడా ఇదే సీన్ రిపీట్ అయింది.



ఎస్సీకాలనీ వాసులతో వాగ్వాదం చేస్తున్న లక్ష్మి

చంద్రబాబూ.. మానవత్వం ఉందా..?

- ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సూటి ప్రశ్న
- వలంటీర్లతో పింఛన్ల పంపిణీ ఆపించి వృద్ధుల ఉసురుపోసుకుంటున్నావంటూ మండిపాటు
- సీఎం జగన్ పేదల పక్షపాతి అని కితాబు



యరజర్లలో రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబుకు మానవత్వం లేదని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. అందువలనే వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందించే ప్రక్రియను తన రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబు అడ్డుకున్నారని తెలిపారు. తన మనుషులతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి మరీ వలంటీర్లతో పింఛన్ల పంపిణీని అడ్డుకోవడం దారుణమన్నారు. వృద్ధుల ఉసురుపోసుకుంటున్నాడని, ఈ పాపం ఊరికే పోదని బాలినేని శాపనార్థాలు పెట్టారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఒంగోలు మండలంలోని యరజర్ల, దేవరంపాడు, బొద్దులూరివారిపాలెం, వలేటివారిపాలెం గ్రామాల్లో శుక్రవారం బాలినేని రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పేదల పక్షపాతిగా వ్యవహరిస్తున్నారన్నారు. పేదల కోసం సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు, పెన్షన్లు, ఇతర ప్రభుత్వ సేవలన్నింటినీ ఇంటి వద్దకే అందిస్తున్నారని వివరించారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకూ పెద్ద పీట వేస్తూ రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. ఇవన్నీ ఇలాగే కొనసాగాలంటే మళ్లీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం ఒంగోలు ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. యరజర్లలో బాలినేని మాట్లాడుతూ గ్రామంలో సచివాలయ భవనం, రైతు భరోసా భవనం, వెల్నెస్ సెంటర్ భవనాన్ని నిర్మించి స్థానిక ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఒంగోలు డివిజన్‌లోనే వేగంగా యరజర్లలో అన్ని భవన నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. గ్రామంలో అంతర్గత రోడ్లు, అభివృద్ధి పనులు సైతం పూర్తి చేశామన్నారు. ఇంకా పూర్తి కావాల్సిన పనుల గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్ ఐదేళ్ల జనరంజక పాలన గురించి ప్రజలకు వివరించారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందించడం, ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాల నగదు బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. ఒంగోలులో ఈ ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని బాలినేని వివరించారు. టీడీపీ నాయకులు ఎన్నో కుట్రలకు పాల్పడినప్పటికీ నిరుపేదలకు 25 వేల ఇళ్ల పట్టాలు అందించామన్నారు. ఈ ఎన్నికల్లో గెలిచిన వెంటనే అందరికీ ఇళ్లు కట్టించి ఇస్తామన్నారు. ఇంకా ఇళ్ల స్థలాలు రాని నిరుపేదలు ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని, వారికి కూడా పట్టాలు ఇస్తామని తెలిపారు. ఈ ఎన్నికల్లో కూడా టీడీపీకి గట్టిగా బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. యరజర్లలో బాలినేని రోడ్ షోలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చుండూరి రవి, పొగాకు బోర్డు ఉత్పత్తిదారుల చైర్మన్ వాకా బసివిరెడ్డి, ఒంగోలు ఎంపీపీ పి.మల్లికార్జునరెడ్డి, సచివాలయాల కన్వీనర్ సోమశేఖర్, యరజర్ల సర్పంచ్ తమ్మిశెట్టి రాములమ్మ, శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ జాజుల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ పందిర్ల రాధా అంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఉలిచిలో సాయంత్రం బాలినేని శ్రీనివాసరెడ్డికి ఘనస్వాగతం లభించింది. పార్టీ మండల అధ్యక్షుడు చుంచు రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్ షోలో బాలినేని మాట్లాడుతూ గ్రామంలో నిరుపేదలకు ఇళ్ల స్థల పట్టాలు అందజేశామన్నారు. సచివాలయ భవనాలు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, నాయకుడు ఆదిశేషయ్య కరవది ఎంపీటీసీ శ్రీనివాసరావు, సర్పంచ్ మురళి, పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు. బొద్దులూరిపాలెంలో సర్పంచ్ కవిత, దేవరంపాడులో సర్పంచ్ మహాలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు సోము, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కంభం వెంకట రమణారావు శుక్రవారం ఆ పార్టీకి రాజీనామా చేసి తన అనుచరులతో కలిసి వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యే అన్నా రాంబాబు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, టీడీపీ, జనసేన పొత్తుతో మనస్తాపం చెంది పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్ సీపీలో చేరారన్నారు. అన్నా రాంబాబుతో పాటు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గెలుపుకు కృషిచేస్తానని తెలిపారు. ఆయనతోపాటు మాజీ టీడీపీ కౌన్సిలర్లు నందిగం శ్రీనివాసులు, జలుకూరి సత్యవతీతోపాటు వేముల పెద్దరంగడు, పొరుమంచాల చిన్నకృష్ణయ్య, దండూరి కోటయ్య, సయ్యద్ ముజీబ్, ఎస్‌కే కరీముల్లా, ఎస్‌కే గౌస్ మొహిద్దీన్, గంగిరెడ్డితోపాటు 9,10 వ బ్లాక్ టీడీపీ బ్లాక్ నాయకులు వైఎస్సార్ సీపీ లో చేరారు. కార్యక్రమంలో రఘుపతి శివ, పెంచికల కాశయ్య, నజీర్, ఉప్పు బాబు, మొగిలి ఇస్మాయిల్ బేగ్, బెల్లంకొండ గోపి పాల్గొన్నారు. వీరందరికీ పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే రాంబాబు పార్టీలోనికి ఆహ్వానించారు. ఏ సమస్య వచ్చినా కార్యకర్తలు తన దృష్టికి తేవాలని, వెంటనే పరిష్కరిస్తానని ఆయన తెలిపారు.

కారు బీభత్సం

- ఒకరు మృతి, మూడు బైక్‌లు ధ్వంసం

గిద్దలూరు రూరల్: అతివేగంగా వస్తున్న కారు బీభత్సం సృష్టించింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మమూడు బైక్‌లు ధ్వంసమయ్యాయి. ఈ సంఘటన నంద్యాల రోడ్డులోని స్వదేశీ రెస్టారెంట్ సమీపంలో శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. నంద్యాల నుంచి గిద్దలూరు వైపుగా వస్తున్న కారు రెస్టారెంట్ వద్ద ఆగి ఉన్న మూడు బైక్‌లను, వ్యక్తిని, విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో కేఎస్‌పల్లెకు చెందిన గాలిరెడ్డి (63) రెస్టారెంట్ వద్ద తన బైక్ పక్కన నిలబడి ఉండగా కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కారు నడుపుతున్న రాజేష్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. కారు ఢీకొట్టడంతో బైక్‌లు ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది గాయాలైన రాజేష్‌ను చికిత్స నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో మృతి చెందిన గాలిరెడ్డి

మంచి చేసే నాయకుడికి అండగా నిలుద్దాం

- సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం
- ఎన్నికల ప్రచారంలో మంత్రి మేరుగు నాగార్జున



మాచవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

నాగులుప్పలపాడు: ఎల్లప్పుడూ ప్రజల బాగోగుల గురించి ఆలోచించి ఎంత వరకు మేలు చేయగలుగుతామా అని తపనపడే నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయనకు అందరూ అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి మేరుగు నాగార్జున కోరారు. గడపగడపకు మన నాగార్జున కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాగులుప్పలపాడు మండలంలోని మద్దిరాలపాడు, ఒబన్నపాలెం, మాచవరం, రాపర్ల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్ నిరంతరం పాటుపడుతున్నారని తెలిపారు. అందులో భాగంగానే 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేశారని తెలిపారు. ప్రతి ఇంటికి ఏదో మంచి చేసిన నాయకుడిగా జగనన్న నిలిచారన్నారు. ఆర్థికంగా, సామాజికంగా ఇంకా వెనుకబడి ఉన్న ప్రజలను వృద్ధిలోకి తీసుకెళ్లాలని సీఎం జగన్ తాపత్రయపడుతుండటం చూస్తే నిజంగా ఇలాంటి నాయకుడు ప్రజలకు కావాలనిపిస్తుందన్నారు. 2019–24 మధ్య కాలంలో లక్షల కోట్ల రూపాయలు సంక్షేమ పథకాల రూపంలో నేరుగా లబ్ధిదారులకు అందించారన్నారు. అంతకు ముందు చంద్రబాబు హయాంలో చేసిన లక్షల కోట్ల అప్పులు ఏ ఒక్కరికీ పథకాలుగా అందించకుండా ఏం చేశారో చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. అవన్నీ గమనించి జగన్‌ను మళ్లీ సీఎంను చేసుకునేందుకు ఎమ్మెల్యేగా తనను, బాపట్ల ఎంపీగా నందిగం సురేష్‌ను వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ముందుగా నాగులుప్పలపాడులో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని మంత్రి మేరుగు నాగార్జున ప్రారంభించారు. అనంతరం నాగులుప్పలపాడు గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, లిడ్ క్యాప్ స్టేట్ డైరెక్టర్ కాకుమాను రాజశేఖర్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇనగంటి పిచ్చిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలమలపు కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ దంపతులు యాదాల అశోక్‌బాబు, రత్నకుమారి, పార్టీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, తుమ్మల బ్రహ్మానందరెడ్డి, వెంకట్రామిరెడ్డి, ఎంపీటీసీ మారెళ్ల మహాలక్ష్మి, కోటమ్మ, శాలివాహన, హౌసింగ్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్లు పేరాల చెన్నకేశవులు, కొలకలూరి విజయ్‌కుమార్, సర్పంచ్ మందా హెప్సీరాణి, ఇనగంటి సీతారావమ్మ రమణారెడ్డి, దాకా అనసూర్యమ్మ రమణారెడ్డి, మాదాసు రాంబాబు, కొంజేటి సురేష్, ప్రసన్న, వజ్రంబాబు పాల్గొన్నారు.

అదనపు బ్యాలెట్‌లకు ఎఫ్ఎల్‌సీ



ఒంగోలు లోక్‌సభ అదనపు బ్యాలెట్ యూనిట్‌ల ఎఫ్ఎల్‌సీ పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి పోటీలో 15 మంది కంటే ఎక్కువ మంది అభ్యర్థులు ఉండటంతో బెంగళూరు నుంచి కొత్తగా వచ్చిన అదనపు బ్యాలెట్ యూనిట్ల(2408)కు ఎఫ్ఎల్‌సి (ఫస్ట్ లెవల్ చెకింగ్) ప్రక్రియను శుక్రవారం స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోదాములో రాజకీయ పార్టీల ప్రతినిధులు సమక్షంలో నిర్వహించారు. శుక్ర, శనివారల్లో ఎఫ్ఎల్‌సీ, ర్యాండమైజేషన్ నిర్వహించి అనంతరం ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు తరలించారు. ఈ మేరకు జరుగుతున్న ఎఫ్ఎల్‌సి ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ పరిశీలించారు. ప్రక్రియలో బెంగళూరు నుంచి వచ్చిన ఏడుగురు సాంకేతిక నిపుణులు ఎఫ్ఎల్‌సీ నిర్వహిస్తున్నారు. మరోవైపు అసెంబ్లీ నియోజకవర్గాలకు వినియోగించే ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ కూడా శుక్రవారం నుంచి ప్రారంభం కావడంతో బెల్ కంపెనీ ఇంజినీర్‌లను ఆయా నియోజకవర్గాలకు పంపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ శ్రీలత, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఒంగోలు ఆర్‌ఓ సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈవీఎంల కమిషనింగ్ పరిశీలన

స్థానిక రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంల కమిషనింగ్ ప్రకియ ఎటువంటి లోపాలు లేకుండా నిబంధనల మేరకు పక్కాగా నిర్వహించారు. బ్యాలెట్ పేపర్ లోడింగ్, అవసరమైన చోట సీల్ వేస్తున్న విధాన్ని కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్‌ఓ సుబ్బారెడ్డి, ఓఎంసీ కమిషనర్ జస్వత్ రావు, ఏఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఒంగోలులో సత్య ఏజెన్సీస్ ప్రారంభం

ఒంగోలు: సత్య ఏజెన్సీస్ 18వ షోరూంను శుక్రవారం ఒంగోలులో ఘనంగా ప్రారంభించారు. షోరూం భవన యజమాని వరాహస్వామి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించగా, సత్య ఏజెన్సీ ఎండీ జాన్సన్, ఏపీ హెడ్ సెంథిల్, ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న వరాహస్వామి


గిద్దలూరులో వడదెబ్బకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన తిక్కస్వామి


మద్దిపాడు కెనరా బ్యాంక్‌లో పింఛనుదారుల ఇక్కట్లు






ఒంగోలు : నెల్లూరు బస్టాండ్ యూనియన్ బ్యాంకులో వృద్ధుల అవస్థలు


గిద్దలూరులో బ్యాంకు బయట వృద్ధుల పడిగాపులు


ఎండ దెబ్బకు తాళలేక.. గిద్దలూరులో ఓ అవ్వ ఇలా..


ముండ్లమూరులో రెండు రోజులుగా బ్యాంక్ చుట్టూ తిరుగుతున్న అవ్వ..

పచ్చ మంద కుతంత్రం..
అవ్వాతాతలకు నరకం

- మండుటెండలో బ్యాంకుల వద్ద పండుటాకుల పడిగాపులు
- చంద్రబాబు, నిమ్మగడ్డ, ఎల్లో మీడియాపై విసుర్లు
- రాక్షసులకు పుట్టగతులుండవంటూ శాపనార్థాలు
- గిద్దలూరులో ఎండకు తాళలేక సొమ్మసిల్లి పడిపోయి వృద్ధుడు, దర్శి మండలం బొట్లపాలెంలో పింఛను కోసం వెళ్లొచ్చి వృద్ధురాలి మృతి

సాక్షి నెట్‌వర్క్: పచ్చటి పందిరికి నిప్పు పెట్టి చలి కాచుకున్నాడంట వెనకటికొకడు.. చంద్రబాబు, ఆయన వందిమాగధుల తీరు కూడా అలాగే ఉంది. కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేసి వలంటీర్ల సేవలను కుట్రతో అడ్డుకున్న చంద్రబాబు.. ఏమీ తెలియనట్లు మొసలి కన్నీరు కార్చడాన్ని అవ్వాతాతలు జీర్ణించుకోలేకపోతున్నారు. బ్యాంక్ అకౌంట్లలో నగదు వేయాలని హితోక్తులు పలికిన పచ్చ మంద.. ఎన్నికల సంఘానికి ఆ మేరకు లేఖలు రాసి సచివాలయాల వద్ద కూడా పింఛను ఇవ్వనివ్వకుండా కుట్రలు పన్నడంపై వృద్ధులు నిప్పులు చెరుగుతున్నారు. తమ బతుకును బజారుపాలు చేసిన రాక్షసులకు పుట్టగతులుండవని అవ్వాతాతలు శాపనార్థాలు పెట్టారు. శుక్రవారం కూడా బ్యాంకుల వద్ద వృద్ధులు పడిగాపులు కాశారు. ఎండ దెబ్బకు తాళలేక గిద్దలూరు పట్టణం కోటగడ్డ సచివాలయం పరిధిలోని అంకాళమ్మ బజారుకు చెందిన శివరాత్రి తిక్కస్వామి సొమ్మసిల్లి పడిపోవడంతో స్థానికులు అతడిని ఏరియా వైద్యశాలకు తరలించగా అక్కడ మృతి చెందాడు. నల్లబండ బజారుకు చెందిన జక్కమ్మ అనే వృద్ధురాలు సైతం బ్యాంకు వద్ద నిల్చోలేక చెట్టు కింద సొమ్మసిల్లి పడిపోయింది. రెండు రోజులుగా బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వచ్చిందని, ముసలోళ్లను ఇబ్బంది పెట్టిన చంద్రబాబుకు మా ఉసురు తగిలిద్ది అని ముండ్లమూరుకు చెందిన తాతపూడి మరియమ్మ తిట్టిపోసింది. జిల్లాలో ఎక్కడ చూసినా ఇవే దృశ్యాలు. ఇదిలా ఉండగా దర్శి మండలం బొట్లపాలేనికి చెందిన తానికొండ రమణమ్మ బ్యాంకులో నగదు తీసుకుని ఇంటికి రాగానే వడదెబ్బతో కన్నుమూసింది.


బేస్తవారిపేటలో బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద వృద్ధుల దీనస్థితి


కంభం ఎస్‌బీఐ వద్ద పింఛను కోసం వచ్చి చెట్ల కింద వేచి ఉన్న వృద్ధులు

3 కి.మీ నడిచి బ్యాంక్‌కి..



నాకు వితంతు పింఛన్ వస్తోంది. ప్రతి నెలా వలంటీర్ ఒకటో తేదీన ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవాడు. ఈనెల నా పింఛన్ బ్యాంక్‌లో వేశారు. 3 కిలో మీటర్లు ఎండకు వచ్చి పింఛన్ తీసుకొని వెళ్తున్నాను. వలంటీర్లను తొలగించాక మాకు కష్టాలు వచ్చాయి.

– సూరబోయిన రోశమ్మ, జిళ్లెళ్లపాడు, వెలిగండ్ల మండలం

ఇంటికే వచ్చి పింఛన్ ఇవ్వాలి



నా పింఛన్ డబ్బులు స్టేట్ బ్యాంకులో వేశారు. ఉదయాన్నే పింఛన్ కోసం వచ్చాను. అప్పటికే చాలా మంది వచ్చారు. బ్యాంకులో క్యూలో నిలబడలేక నానా ఇబ్బంది పడ్డాను. సంవత్సరాలుగా ఇంటి దగ్గరే పింఛన్ తీసుకున్నా. ఎండలో వచ్చి పింఛను తీసుకోవాలంటే రాలేను. టీడీపీ వాళ్లు రాజకీయాలు చేసి ముసిలోళ్లను ఇబ్బంది పెట్టడం న్యాయం కాదు. మళ్లా ఇంటికే వచ్చి పింఛన్ ఇచ్చి మమ్మల్ని ఆదుకోవాలి.

– వి.సుబ్బమ్మ, పామూరు

ఆరుబయట ఎండలో..



బ్యాంకుల్లో పడిన పింఛను తీసుకునేందుకు వచ్చి నానా ఇబ్బందులు పడ్డాం. ఆటోలో వచ్చేందుకు రూ.50 తీసుకున్నారు. బ్యాంకు వచ్చేసరికి చాలామంది ఉండటంతో బ్యాంకు బయట మెట్లదగ్గర చాలాసేపు కుర్చున్నా. పింఛన్ తీసుకునేసరికి ఎండ మరింత ఎక్కువ కావడంతో వెంటనే పోలేక బ్యాంకు దగ్గర కూర్చుని మళ్లీ ఆటో మాట్లాడుకుని ఇంటికిపోయా. ఈ ఎండలో ఇలా పింఛన్ కోసం తిరగడానికి కారణమైన చంద్రబాబుకు మా ఉసురు తగులుతుంది.

– బత్తుల లక్ష్మమ్మ, తిమ్మారెడ్డిపల్లె

అకౌంట్ రన్నింగ్‌లో లేదని పింఛన్ ఇవ్వలేదు



నా అకౌంట్ రన్నింగ్‌లో లేదని పింఛన్ ఇవ్వలేదు. రన్నింగ్‌లో పెడితే డబ్బులు కట్ అవుతాయి అంటున్నారు. పై పెచ్చు రేపు రమ్మంటున్నారు. నాకు ఖర్చులకు ఎలా. వలంటీర్ వ్యవస్థ ఎందుకు తీసేశారు. తిరిగి వలంటీర్ల చేత పింఛన్ ఇప్పించాలి.

– పురిణి నాంచారమ్మ, కొత్తపట్నం

డాక్టరమ్మా..?
యాక్టరమ్మా..?

- దర్శి టీడీపీ అభ్యర్థి లక్ష్మి వ్యవహార శైలిపై ప్రజల విస్మయం
- చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలు నమ్మడం లేదని సొంత మేనిఫెస్టో
- దర్శిలో వంద పడకల ఆస్పత్రి కట్టిస్తానంటూ ప్రగల్భాలు
- నరసరావుపేటలో కడియాల క్లినిక్ కేంద్రంగా దోపిడీపై విస్తృత చర్చ
- స్వగ్రామం యలమందలో కళ్యాణ మండపం పేరుతో వసూళ్ల దందా
- లక్ష్మి సొంతూరులో వైఎస్సార్ సీపీ పాలనలో రూ.36.60 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం

దర్శి: ఉట్టి కెక్కలేనమ్మ స్వర్గానికెక్కుతానందట.. దర్శి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మి తీరు అలాగే ఉంది. కళ్లు ఆర్పకుండా అబద్ధాలు చెప్పడంలో ఆమె తన బాస్ చంద్రబాబునే మించిపోయిందన్న మాట వినిపిస్తోంది. టీడీపీ మేనిఫెస్టో కాకుండా సొంత మేనిఫెస్టో చదివి వినిపిస్తుండటం చూసి పచ్చ నేతలే విస్తుపోతున్నారు. ఉన్నట్టుండి నియోజకవర్గంలో ఊడిపడిన లక్ష్మి వ్యవహార శైలిపై ఆరా తీసిన జనానికి సకుటుంబ సమేతంగా ఆమె చేస్తున్న దోపిడీ గురించి తెలిసి ముక్కున వేలేసుకుంటున్నారు. పదవీ వ్యామోహంతో పచ్చి అబద్ధాలు ప్రచారం చేయడంపైనా జోరుగా చర్చ సాగుతోంది.

బాబు డబ్బా నమ్మడం లేదని..

టీడీపీ అధినేత చంద్రబాబు సూపర్ సిక్స్ పేరుతో హామీలు గుప్పించినా జన స్పందన కరువైంది. దీంతో దర్శి టీడీపీ అభ్యర్థి సొంత డబ్బా కొట్టడం ప్రారంభించారన్న విమర్శలొస్తున్నాయి. దర్శిలో 100 పడకల ఆస్పత్రి కట్టిస్తాం, సాగర్ జలాలు అందిస్తానంటూ తన పరిధిలో లేని విషయాలను వల్లెవేయడం చూసి సొంత పార్టీ నేతలే విస్తుపోతున్నారు. వాస్తవానికి టీడీపీ జమానాలో దర్శి సీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది లేక రాత్రి వేళ తాళాలు వేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక దర్శి సీహెచ్‌సీని 50 పడకల ఆసుపత్రిగా మార్చి, నాడు–నేడు కింద రూ.3 కోట్ల వరకు ఖర్చు చేసి నూతన భవనంలో అత్యాధునిక పరికరాలు ఏర్పాటు చేశారు. 9 విభాగాల వైద్యులు, సిబ్బంది 24 గంటలూ కార్పొరేట్ స్థాయి సేవలందిస్తున్నారు.

సొంతూరికి ఏం చేశారు?

లక్ష్మితో పాటు భర్త, మామ వైద్యులే. అయినా వారి స్వగ్రామం యలమందలో పీహెచ్‌సీ కాదు కదా విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేయించలేకపోయారు. వైఎస్ జగన్ పాలనలో యలమందలో హెల్త్ సెంటర్, సచివాలయం, ఆర్బీకే నిర్మించడమే కాకుండా పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు. రూ.30.59 కోట్లతో సంక్షేమ పథకాలు అందించి, రూ.6.5 కోట్ల అభివృద్ధి పనులు చేశారు. టీడీపీ జమానాలో యలమందలో ఏం చేశారనే ప్రశ్నకు లక్ష్మి ఏం బదులిస్తారని ప్రజలు బహిరంగంగానే అడుగుతున్నారు.

సొంత ఆస్పత్రిలో దోపిడీ..

వెంకటేశ్వర క్లినిక్ కేంద్రంగా లక్ష్మి సకుటుంబ సమేతంగా సాగించిన దోపిడీ దర్శి నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. కరోనా సమయంలో కాన్పుల కోసం వచ్చిన మహిళల నుంచి రూ.లక్షల్లో గుంజినట్లు తీవ్ర ఆరోపణలున్నాయి.


దర్శి టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి స్వగ్రామం యలమందలో నిర్మించిన 1.సచివాలయం, 2.వైఎస్సార్ హెల్త్ క్లినిక్, 3.ఆర్బీకే

సాధారణ సేవలకూ రూ.వేలల్లో ఫీజులు బాది రూ.కోట్లకు పడగలెత్తారేగానీ పేదల కోసం ఒక్కటైనా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయలేదన్న విమర్శలున్నాయి. కళ్యాణ మండపం పేరుతో భారీగా డబ్బు వసూలు చేసి ఇప్పటికీ పూర్తి చేయకపోవడం కడియాల కుటుంబం ధన యావను తేటతెల్లం చేస్తోందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

లోకలా.. ఎట్టిట్టా..?

దర్శిలో లోకల్ అభ్యర్థినే పోటీలో నిలపాలని స్థానిక టీడీపీ నేతలు చేసిన డిమాండ్‌ను టీడీపీ అధిష్టానం పట్టించుకోలేదు. ఈ క్రమంలో దర్శి అభ్యర్థిగా బరిలోకి దిగిన లక్ష్మి ఇక్కడ అడుగుపెట్టగానే తాను లోకల్ అని మాట్లాడటంతో పెను దుమారమే రేగింది. వాస్తవానికి లక్ష్మితోపాటు ఆమె కుటుంబ సభ్యుల ఓట్లు నరసరావుపేటలో ఉన్నాయి. ఇక్కడ సొంత ఇల్లు కూడా లేదు. చంద్రబాబు వద్ద రూ.కోట్లు కుమ్మరించి సీటు తెచ్చుకున్నంత మాత్రాన లక్ష్మి లోకల్ కాలేదంటూ దర్శి టీడీపీలో ద్వితీయ శ్రేణి నాయకులు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఆమె యాక్టర్ కాబోయి డాక్టరై ఉంటుందని అభిప్రాయపడ్డారు.

బేస్తవారిపేట: గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో శిథిలమైన బడులు 'నాడు–నేడు'తో సుందరంగా మారాయి. ఆధునిక వైద్య పరికరాలు, ఆహ్లాదకర పరిసరాలతో వైద్యశాలలు కార్పొరేట్ రూపును సంతరించుకున్నాయి. పూర్తి స్థాయిలో వైద్యులు, వైద్యారోగ్య సిబ్బంది నియామకం, కొత్త వైద్యశాలల ఏర్పాటుతో ప్రజారోగ్యం మరింత మెరుగుపడింది. ఏ అవసరమొచ్చినా మండల కేంద్రాలకు పరుగెత్తే సమస్య లేకుండా సొంతూరిలోనే గ్రామ/వార్డు సచివాలయాలు సేవలందిస్తున్నాయి. రైతు భరోసా కేంద్రాలు, అగ్రి టెస్ట్ ల్యాబ్‌ల్లో రైతులకు అవసరమైన సేవలందుతున్నాయి. పేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్ల నిర్మాణం, నాణ్యమైన విద్యుత్ అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించడంతో గిద్దలూరులో అభివృద్ధి జోరందుకుంది. సంక్షేమ పథకాల లబ్ధిదారులకు డీబీటీ, నాన్ డీబీటీ కింద నేరుగా నిధులు విడుదల చేయడంతో ఆర్థిక భరోసా దక్కింది.



గిద్దలూరులో రూ.24 కోట్లతో నిర్మించిన ప్రాంతీయ వైద్యశాల

గిద్దలూరుకు
ప్రగతి హారతి

- గ్రామ/వార్డు సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ సెంటర్లకు పక్కా భవనాలు
- నాడు–నేడుతో సమూలంగా మారిన పాఠశాలలు, పీహెచ్‌సీల రూపురేఖలు
- గిద్దలూరులో రూ.24 కోట్లతో ఏరియా వైద్యశాల నిర్మాణం
- రూ.90 కోట్లతో వేర్వేరుగా వ్యవసాయ, గృహాల విద్యుత్ లైన్లు
- 116 జగనన్న లేఔట్లలో 7,230 మందికి పైగా ఇళ్ల పట్టాలు
- రూ.83 కోట్లతో తారు రోడ్లు, సీసీ రోడ్లు, మెటల్ రోడ్ల అభివృద్ధి



గిద్దలూరు నియోజకవర్గ సంక్షేమ లబ్ధి వివరాలు

పథకం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
జగనన్న అమ్మఒడి	31,504	140.145
జగనన్న విద్యాదీవెన	21,534	58.037
జగనన్న వసతి దీవెన	16,918	26.661
రైతు భరోసా	47,144	220.555
ఉచిత పంటల బీమా	23,025	56.503
సున్నా వడ్డీ పంట రుణాలు	11,274	4.548
ఇన్‌పుట్ సబ్సిడీ	32,674	35.834
పింఛన్ కానుక	46,432	381.319
చేయూత	34,943	57.9195
ఆసరా	49,059	115.624
సున్నా వడ్డీ(డ్వాక్రా)	69,754	35.099
కాపు నేస్తం	1860	6.47
ఈబీసీ నేస్తం	4,146	11.48
కల్యాణమస్తు, షాదీతోఫా	149	0.496
ఆరోగ్యశ్రీ	10,364	32.542
ఆరోగ్య ఆసరా	6,231	6.303
జగనన్న హౌసింగ్	5,695	74.491
వైఎస్సార్ బీమా	741	11.361
వాహనమిత్ర	1,369	3.911
నేతన్న నేస్తం	106	0.861
జగనన్న చేదోడు	2,415	5.109
కోవిడ్ సాయం	70,934	6.995
జగనన్న తోడు (వడ్డీ)	6,029	3.526
నాన్ డీబీటీ పథకాల లబ్ధి		
జగనన్న విద్యాకానుక	20,846	16.71
బైజూస్ ట్యాబ్‌లు	2,495	3.434
జగనన్న గోరుముద్ద	21,611	77.118
సంపూర్ణపోషణ	22,325	39.694
ఇంటింటికి రేషన్	43,074	97.599
జగనన్న తోడు	8,947	16.813
డీబీటీ+నాన్ డీబీటీ మొత్తం రూ.506.45 కోట్లు		

నాణ్యమైన విద్యుత్

కొమరోలు మండలంలోని నల్లగుంట్లలో రూ.50 లక్షలు, అల్లినగరంలో రూ.1.70 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. కంభం మండలం తురిమెళ్ల, అర్ధవీడు మండలం కొత్తూరులో రూ.4 కోట్లు, రాచర్ల మండలం మేడంవారిపల్లెలో రూ.30 లక్షలతో సబ్‌స్టేషన్లు నిర్మించారు. ఆర్‌డీఎస్ఎస్ పథకంలో భాగంగా నియోజకవర్గంలో రూ.90 కోట్లు వెచ్చించి ప్రతి పల్లెకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టారు. వ్యవసాయానికి, గ్రామాలకు వేర్వేరుగా విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయి.


కొమరోలులో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్

సరికొత్త దారులు

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా సచివాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున కేటాయించడంతో ముమ్మరంగా అభివృద్ధి పనులు చేపట్టారు. నియోజకవర్గం మొత్తం మీద రూ.7.64 కోట్లు ఖర్చు చేసి 226 సీసీ రోడ్లు నిర్మించారు. ఉపాధిహామీ పథకంలో 329 పనులను రూ.32.16 కోట్లు, జెడ్పీ నిధులతో 150 పనులను రూ. 6.9 కోట్లు, ఎంపీ నిధులతో 71 పనులు రూ.3.39 కోట్లు, బీటీ(తారు), లింక్, అప్రోచ్ రోడ్లకు సంబంధించి 37 పనులకు రూ.32.16 కోట్లు, సీఎండీఎఫ్ 41 వర్క్‌లకు రూ.1.42 కోట్లు కేటాయించి పనులు పూర్తి చేశారు.


కంభంలో నిర్మించిన సీసీ డబుల్‌రోడ్డు


నూతనంగా నిర్మించిన మల్లాపురం బీటీ రోడ్డు

ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో రూ.14.17 కోట్లతో 65 రైతు భరోసా కేంద్రాలు, రూ.25.20 కోట్లతో 63 గ్రామ/వార్డు సచివాలయాలు, రూ.8.7 కోట్లతో 40 హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను రాష్ట్ర ప్రభుత్వం నిర్మించింది. సలకలవీడు గ్రామంలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేశారు.

బేస్తవారిపేటలోని రైతు భరోసా కేంద్రం


ప్రభుత్వ ఆస్పత్రులకు కార్పొరేట్ కళ

గిద్దలూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందుతుండటంతో పేద, మధ్య తరగతి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గిద్దలూరు కమ్యూనిటీ ఆస్పత్రిని ప్రాంతీయ వైద్యశాలగా మార్పు చేయడమే కాకుండా రూ.24 కోట్లతో నూతన భవనాలు నిర్మించారు. గతంలో నలుగురు డాక్టర్లు ఉండగా ఇప్పుడు 21 మంది సేవలు అందిస్తున్నారు. కంభం ప్రభుత్వ వైద్యశాలను రూ.3 కోట్లతో వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేశారు. గలిజేరుగుళ్ల పీహెచ్‌సీలో రూ 1.20 కోట్లతో నూతన భవనాలు నిర్మించారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.8.72 కోట్లు ఖర్చు చేసి 40 వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు నిర్మించి సేవలందిస్తున్నారు. బేస్తవారిపేట పీహెచ్‌సీని రూ.10 లక్షలతో అభివృద్ధి చేశారు.

సుందరంగా నాగేశ్వరస్వామి ఆలయం

గిద్దలూరులోని పురాతన పాతాళ నాగేశ్వరస్వామి ఆలయం అభివృద్ధి కోసం రూ.1.14 కోట్లను సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు భక్తులకు అవసరమైన వసతులు కల్పించారు.


గిద్దలూరులో రూ.1.14 కోట్లు అభివృద్ధి చేసిన పాతాల నాగేశ్వరస్వామి ఆలయం

పేదల సొంతింటి కల సాకారం

నియోజకవర్గంలో జగనన్న కాలనీలను సమర్థవంతంగా నిర్మించారు. బేస్తవారిపేట, కంభం, అర్ధవీడు, గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాల్లో 116 లేఔట్లు ఏర్పాటు చేసి 7,230 మందికి పక్కా గృహాలు మంజూరు చేశారు. 3,769 గృహాలు పూర్తికాగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ఇందుకుగాను ప్రభుత్వం రూ.71.3 కోట్లు ఖర్చు చేసింది.


చిన్న కంభంలో జగనన్న హౌసింగ్ కాలనీలో నిర్మించుకున్న గృహాలు


కొమరోలు : పొట్టిరెడ్డిపల్లెలో చూడచక్కగా ప్రాథమిక పాఠశాల

నాడు శిథిలం.. నేడు అద్దం

నాడు–నేడు కార్యక్రమం ఫేజ్–1, ఫేజ్–2లో నియోజకవర్గంలోని పాఠశాలల రూపురేఖలు మారాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థుల చదువు సాగేందుకు వీలుగా సౌకర్యాలు కల్పించారు. ఇందు కోసం రూ.62.22 కోట్లు ఖర్చు చేశారు. అమ్మఒడి పథకంలో 34,504 మంది లబ్ధి పొందారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, దుస్తులు, టై, బెల్ట్, షూస్ అందజేయడంతో ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే వారి సంఖ్య భారీగా పెరిగింది.

అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా..

రైతుల ప్రయోజనాలే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. నియోజకవర్గ స్థాయిలో గిద్దలూరులో రూ.68.3 లక్షలతో అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను అందుబాటులో తీసుకురావడంతో 10,500 మంది రైతులకు మేలు చేకూరింది. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలు అందిస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


గిద్దలూరులో రూ.68 లక్షలతో నిర్మించిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్